


## (క్రిందటి నెల నుంచి కొనసాగింపు)

కృష్ణమోహన్తో జరిపిన సంభాషణ రవి ఎవరికీ చెప్పలేదు. చెప్పడానికి కూడ తనకెవరున్నారు? ఒక్క భార్య తప్ప! ఆమెకూ చెప్పవద్దని కృష్ణమోహన్ ప్రత్యేకంగా చెప్పాడు గనుక ఆమాటకు కట్టుబడి ఇందిరకు చెప్పలేదు. ఇక తనకు చెప్పకోదగ్గ మిత్రులే లేరు, పరిచయస్తులు తప్ప!

తనకు 60ఏళ్లు రాగానే రిటైర్మెంటు అతి సాదాసీదాగా గడిచిపోయింది. ఆఫీసు వాళ్లే ఒక చిన్న ఫేర్వెల్ పార్టీ ఇచ్చి రెండు మంచి మాటలు చెప్పి సాగనంపారు. తనూ ఏం హడావిడి చెయ్యలేదు

అంతా బాగానే ఉంది, కాని వంశీ గాడే ఈ ఉపద్రవం తెచ్చిపెట్టాడు. కంటిమీద కునుకు లేకుండాచేశాడు. వాడు చెప్పినట్టుచేయకుంటే ఏం జరుగుతుందో తనకు తెలుసుగనుక తన పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తాము వంశీ చెప్పినట్లు ఇల్లు ఖాళీ చెయ్యకపోతే జరిగేదేమిటో తను ఇందిరకు ఇప్పుడుచెప్పినా అర్థం కాదు. గనుక ఆమెకు ఆ పరిస్థితి వచ్చాక అర్థమయ్యేక తమ తదుపరి చర్య తీసుకోవలసి ఉంటుంది.

***

తానే మీ వేరే ఇంటి కోసం ప్రయత్నం చెయ్యలేదు.. ఈ లోగా వంశీ పెట్టిన గడువు పూర్తయింది. వాడీసారి తనకు గాని, ఇందిరకుగాని మరల ఫోన్ చెయ్యలేదు. ఒకవారం తిరిగేసరికి పోస్టుమ్యాన్ తనకో రిజిష్టర్ లెటరుందని చెప్పాడు. సంతకం పెట్టి తీసుకుంటే అది లాయర్ నోటీస్!

అనుకున్నంతా అయింది. ఆ రిజిష్టరు లెటరు వంశీ తరపు అడ్వకేట్ నుండి వచ్చింది. దాని సారాంశం :

"శ్రీ రవి గారికి – ఇది వంశీ అనే నా క్లయింటు తరుపున మీకిస్తున్న నోటిసు, మీరు వంశీ ఇంటిలో ఒక పోర్షన్లో అది కొని గృహప్రవేశం చేసినప్పటి నుండి ఉంటున్నారు. మీమీద ఉండే గౌరవభావం వలన, ఆత్మీయతా భావం వలన మీ దగ్గర నుండి నా క్లయింటు అద్దె కూడ తీసుకోవడం లేదు. కాని ఇప్పుడు నా క్లయింటుకు మీరుంటున్న పోర్షన్ కావలసి వచ్చింది. ఎందుకు కావలసివచ్చిందో తెలియజేస్తూ మీకు రెండు ఉత్తరాలు రాయడమేగాక అనేక సార్లు ఫోన్లు చేయడం జరిగింది. మీరు వేరే ఇల్లు చూసుకోవడానికి నా క్లయింటు తగిన సమయమిచ్చినా మీరు తన ఇంటిని ఖాళీ చేయడంగాని, ఆ ప్రయత్నంగాని చేయలేదని తెలిసింది. అందువలన మిమ్మ్ము ఇందు మూలముగా – మీరిప్పడున్న మా క్లయింటుకు చెందిన పోర్షనును ఖాళీ చేయవలసిందిగాకోరుచున్నాము. మీరు ఖాళీ చేయడానికి ఈ నోటీసు అందిన నెలరోజులు గడువివ్వడం జరుగుచున్నది. ఈ నెలపూర్తయినా మీరు ఖాళీ చెయ్యకపోతే నా క్లయింటు తరపున నేను తీసుకునే తదుపరి చర్యకు బాధ్యులగుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది" స్టేషన్ : యస్.డి. అడ్వకేట్

ఇది రవి ఊహించినదే కాని, ఇంత త్వరగా ఏక్షన్లోకి వెళ్లాడని మాత్రం అనుకోలేదు. రవి చేతిలోని ఉత్తరం తీసుకుని ఇందిర చదివింది. కుర్చీలో కూలబడిపోయింది. ఆమెకు ఇదో పెద్ద షాక్. కళ్లు మూసుకుని ఏడ్వడం మొదలు పెట్టింది. కొంతసేపు ఏడ్వడమే మంచిదనిపించింది, ఇందిర కొంచం కుదుట బడ్డాక రవి తన దగ్గరకు తీసుకుని అనునయించాడు.

"ఇందిరా! ఇది నేనూహించినదే! వాడు మన మీద వ్యతిరేభావం ఏర్పరచుకున్నపుడు తన చేతిలో ఉన్న అన్ని ఆయుధాలు ఉపయోగిస్తాడు. వాడిప్పుడు సంధించిన బాణం అతి సున్నితమైనది. దానికి మనం గాభరా పడిపోనక్కర లేదు. నిలదొక్కుకోవడానికి ప్రయత్నిద్దాం. మనకూ వాడి బాణాలును ఎదుర్కోవడానికి – కొన్ని ఆయుధాలున్నాయి. ఒక్కొక్కటీ ఉపయోగిద్దాం. అయితే ఎదుర్కొనే ముందు మన ఇద్దరం కొంత ఆలోచన చేయాలి. దాని తరువాతే మన తదుపరి చర్య ఉంటుంది ఏమంటావు?"

"నేనేమంటానండీ, ఒక్కటి తప్పు! అంతా మన ఖర్మ! వాడు మన కడుపున చెడబుట్టాడు. లేకపోతే బయటవాడు కూడ చేయని అన్యాయానికి – కన్న కొడుకయి ఉండి ఇలా చేస్తాడా? మీరప్పడే చెప్పారు, మనం డబ్బు ఇచ్చేటప్పుడు, మన పాత అపార్టుమెంటు అమ్మేప్పుడు. నేనే పనికిమాలిన దాన్ని, ముందు చూపులేని దాన్ని, మీ చేత బలవంతంగా మన ఇంటిని అమ్మించాను. డబ్బు ఇచ్చేటప్పుడు ఏ మాత్రం జాగ్రత్తలు తీసుకోలేదు. కనీసం ఒక ప్రానోటు అయినా రాయినంచుకుందామని మీరంటే ఛా! అదేంటండీ, కొడుకు చేత ప్రోనోటు రాయించుకోవడమా!' అని మిమ్మల్ని ఎద్దేవా చేశాను. చివరికిలా సర్వనాశన మయ్యాం."

రవి శాంతంగా విన్నాడు. చాలా ముందు చూపుతోనే తననీ, తన బిడ్డలనీ తన కన్న తల్లిదండ్రులకీ, రక్తం పంచుకుపుట్టిన తోడపుట్టిన వాళ్లకి దూరం చేయడంలో నూటికి నూరుపాళ్లు జయప్రదం అయింది ఇందిర.

"ఇందిరా! మన గత చరిత్ర అంతసవ్యంగా లేదు. నాకిది ఇదివరకే తెలిసినా నీ అడుగులకి మడుగులొత్తి నీ బాటనే అనుసరించాను. మనపిల్లలూ అదే దారిలో అదే అపసవ్యపు మార్గంలో నడుస్తున్నారు! ఇప్పుడు విచారించి ఏం లాభం? ప్రమాదం తన మీదకు వచ్చాక కాని ఎవడూ మేలుకోడు! అయితే అప్పటికే జరగవలసిన ప్రమాదం జరిగిపోతుంది. మనమూ అదే పరిస్థితుల్లో ఉన్నాం."

ఇందిరకిది శరాఘాతం! తన తప్పిదాన్ని ఇప్పటివరకూ ఎత్తిచూపని తన భర్త ఇప్పడిలా నెపమంతా తన మీదే వేస్తున్నాడు! అదెంత నిజమయినా తను అంగీకరించకూడదు.

""మీరూ నన్నే అనండి..! నేనేం వాళ్లనిలా చెయ్యమని చెప్పానా లేక మిమ్మల్ని నా దారిలో నడవమని బలవంతం చేశానా? మీకిష్టమయి మీరు చేసిందానికి నన్నంటూరెందుకు? ఆ వెధవిలా ఎదురుతిరుగుతాడని నేనుకల గన్నానా?" అంటూ మరల ఏడుపు ప్రారంభించింది.

రవి మౌనం, ఆలోచనా ధోరణి చూసి ఇందిరకు చిర్రెత్తుకొచ్చింది. ఏడుపమాని తన కోపమంతా రవి మీద చూపెట్టింది

" అలా బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడరేం? ఇందులో మీ తప్పేం లేదా? నేనే నేరస్తురాలినా?"

"ఎందుకు లేదు. తప్పంతా నాదే ! ఇంతచదువు చదివి, అంత విజ్ఞాన వంతుడైన తండ్రికి పెద్ద కొడుకునైఉండి, రామాయణ, భారత, భాగవత కథాకథన చక్రవర్తి అయిన నా పితామహుని నుండి ఎన్నోపురాణగాధలు, నీతి కథలు విని, నా కన్న తల్లిదండ్రులను, తోడబుట్టిన వాళ్లను నా దరికి రాకుండా చేస్తూ వాళ్ల కష్టసుఖాల్లో పాలు పంచుకోకపోవడం, ఏమీ కారణం లేకుండానే – పూర్తిగా నా తప్పే! దానికి నిన్ననవలిసిన పని లేదు నేనుకళ్లన్న కబోదిని. వినికిడి జ్ఞానం ఉన్న చెవిటిని. నీకు మళ్లీ మళ్లీ చెబుతున్నాను. దీంట్లో నీ తప్పేంలేదు. నీకు తోచింది, నీ బుద్ధికి నచ్చింది నువ్వు చెబుతూ వచ్చావు. నా ఆలోచనలేమైనాయి? నా బుద్ధి గడ్డి తింటుంటే చూస్తూ ఊరుకోవడం అది నా తప్పే ఇందిరా, ముమ్మాటికి నా తప్పే. ఇక చాలు ఈ వాదనింక ఆపేద్దాం. ఇకనుండి – ఇంతటి అన్యాయం మనకు జరిగాకయినా ఒక అంగీకారానికి వద్దాం. ప్రతి విషయంలోను నీ సలహా నువ్వు చెబితే వింటాను. కాని నా విచక్షణనుపయోగించి క్రియగాని, ప్రతిక్రియతో గాని ముందుకు వెళాను, దానికి నువ్వంగీకరించాలి. ఒక వేళ మనకు అభిప్రాయ బేదాలున్నా – వుయ్మస్ట్ ఎగ్రీ టు డిజ గ్రీ".

ఇందిర మాట్లాడలేదు. మౌనాన్ని అర్ధాంగీకారంగా తీసుకుని అప్పటికా చర్చముగించి భవిష్యత్ కార్యాచరణకి ముందుకు కదిలాడు రవి.

★★★

రెండు మూడు రోజులపాటు రవి ఆలోచించాడు, ఇది తన బంధు మిత్రులలో చర్చించడానికి వీలులేదు. ఎందుకంటే ఒకటి. తనకు ఆత్మీయ మిత్రులెవరూ లేదు. రెండు బంధువులను, ఆత్మీయబంధువులను ఆమడదూరంలో ఉంచడం వలన ఇప్పడే ముఖం పెట్టుకుని వాళ్ల సలహానడగ్గలడు? అందువలన తనకు తెలిసిన ఒక అడ్వకేట్ని కలవాలని నిర్ణయించాడు.

ఆ లాయరు పేరు రమణ, తెలుగువాడే. అంతా విని రమణ పెద్దగా ఆలోచించకుండానే

"రవిగారూ! మీ దగ్గర మీ అబ్బాయి వంశీకి డబ్బు ఇచ్చినట్టు ఆధారాలు ఏమైనా ఉన్నాయా?"

"అంటే.."

"అదే ప్రామిసరీ నోట్లు, అలాంటివి."

"ఏమీ లేవండి! ఆ అవసరం లేదనుకున్నాం"

"అయితే మీరిల్లు ఖాళీ చేయడం తప్ప మరో మార్గం లేదు"

"అంతేనా లాయరు గారూ? "

"అంతే మరి. న్యాయదేవతకు చెవులే కాని కళ్లు లేవు. ఒకటి చెప్పండి, మీరిప్పటికిప్పుడు ఖాళీ చెయ్యకుండా మార్గం చెప్పమంటే చెబుతాను."

రవి ఆలోచించాడు. కొంత టైము తీసికుంటే సైకలాజికల్గా ఇందిరకూ తనకూ కొంత రిలీఫ్ దొరకవచ్చు.

" రమణ గారూ, కనీసం కొంత టైమయినా ఉంటే ఏదో ఒకటి ఆలోచించవచ్చును."

"సరే అయితే, ఈ వకాల్తా మీద సంతకం పెట్టండి. కోర్టులో లాయరు

కేసు ఫైలు చెయ్యనివ్వండి. ఈలోగా మనం రిపై తయారుచేద్దాం. కేస్ ని ప్రొలాంగ్ చేద్దాం"

రవి ఆ ప్రకారం సంతకం చేసి రమణ అడిగిన ఫీజు ఇచ్చి ఇంటికి చేరాడు. ఆతృతగా ఎదురుచూస్తున్న ఇందిరకు విషయం చెప్పి ఆ వ్యవహారానికి తాత్కాలికపు ముగింపు పలికాడు.

★★★

వంశీ ఇచ్చిన లీగల్ నోటీసు టైము గడిచిపోయింది. వంశీ లాయరు కోర్టులో కేస్ ఫైల్ చేశాడు. కోర్టు నుండి హాజరు కావలసిందిగా రవికి సమన్లు వచ్చేయి. దానికి లాయరు రమణ తగిన రిపైని కోర్డువారికి ఫైలు చేశాడు. రమణ కోర్టుకు హజరయ్యాడు. కాని వంశీ హాజరుకాలేదు. ఆయన తరుపున వంశీ భార్య హాజరవడానికి పర్మిషన్ కోరుతూ కోర్డువారికి విన్నవించడం జరిగింది. దానితో కేసుని రెండు నెలలకు వాయిదా వేసారు. ఈ ప్రకారంగా తాము ఖాళీ చెయ్యడానికి టైము అడగకుండానే రెండు నెలల వెసులుబాటు వచ్చింది. రవి, ఇందిరా ఊపిరి పీల్చుకున్నారు. మరోవారం రోజుల్లో రవికి మరో రిజిస్టర్ లెటర్ అందింది, ఈసారి దానికి ఎక్నాలెడ్జ్మెంటు కూడ జతచేయబడింది. కోర్టునుండి వచ్చే సమన్లు రిజిష్టరు పోస్టులో వస్తే రావచ్చునుగాని, ఎక్నాలెడ్జ్మెంటు ద్యూలో, సాధారణంగా రావు, ఆ సమయానికి రవి ఇంటిదగ్గరే ఉండటంతో ఆత్రుతగా ఓపెన్ చేశాడు. కవరు లోపల ఒక శుభలేఖ, దానికి జతచేసి ఒక ఉత్తరం ఉన్నాయి. అది కృష్ణమోహన్ పెళ్ళి శుభలేఖ! అయితే శుభలేఖ రిజిష్టర్ పోస్టు లో రావాలిసిన అవసరమేముంది? కాని శుభలేఖలో ఆహ్వానించువారు క్రింద జ్యోతి, శివ" అని క్రింద వారి అడ్రసు ఉంది!.

రవికి ఆనందం, ఆశ్చర్యం – తబ్బిబైపోయాడు. ఏమిటర్ధం? ఈ కృష్ణమోహన్. ఈ డైనమిక్ కృష్ణమోహన్ తనను తన ఎంక్వైరీతో ప్రమాదభరితమైన కేసు నుండి బయటపడేసిన, తనను కలవడానికి అతని ఇంటికి వెళ్ళినపుడు తన మీద ఆప్యాయతానురాగాల విరిజల్లులు కురిపించిన ఈ కుర్రవాడు తన స్వంత మేనల్లుడు! తన చెల్లెలు జ్యోతి కొడుకు! ఈ సంతోషంలో మునిగి శుభలేఖతో పాటు వచ్చిన ఉత్తరం సంగతే పట్టించుకోకుండా చేతిలోపట్టుకుని కళ్లు మూసుకుని ఉండిపోయాడు.

కొంతసేపటికి రవి మామూలు లోకంలోకి వచ్చేడు. శుభలేఖని ఆప్యాయంగా స్పృశించి దానితో జత చేసిన ఉత్తరాన్ని తెరిచాడు.

'మైడియర్ రవిమామయ్యగారూ! నమస్తే! మీరు హైద్రాబాద్లో మాయింటికి వచ్చినపుడు మాటల సందర్భములో మీ గురించి అంతా మాఅమ్మ చెప్పిందని అంటే ఆమె పేరేమిటి అని మీరు అమితమైన ఆసక్తితోను, ఆతృతతోను అడిగారు, ఆసంగతి మీకు త్వరలో తెలుస్తుందని చెప్పి తప్పించుకున్నాను. ఇప్పుడు తెలిసింది కదా! మా యింటి దగ్గర ఏదో యధాలాపంగా అడిగినట్లు మీ వ్యక్తిగత విషయాలు చాల లోతుగా అడిగి మిమ్మల్ని విసిగించాను. అయితే మీరే సందర్భంలోను విసుగుచెందక నిజాల్ని పూర్తి నిజాల్ని ఇసుమంతైనా దాయకుండా చెప్పారు. నేనడిగిన ప్రశ్నలను కేవలం సూచనలుగా తీసుకుని మీ హృదయాన్ని వ్యధిత, పశ్చాత్తాప్తహృదయాన్ని నాముందు కుమ్మరించారు! నివురుగప్పిన నిప్పు తన సహజస్వభావాన్ని కోల్పోదు! మీరూ అంతే. ఆ సందర్భంలో నా రాక కాకతాళీయమే అయినా అది మంచికి దారితీసిన యాక్సిడెంట్!

ఎంక్వయిరీకి నేనుగాక మరొకడు, నెగెటివ్ ఏప్రోచ్తో వచ్చి, కాసులకు కక్కుర్తిపడి మీమీద కేసును కన్ఫర్మ్ చేస్తే ఫలితాలు దారుణం! మీఇన్నేళ్ల నిజాయితీ తో కూడిన ఉద్యోగ జీవితానికి తెర, అదీ చీకటి తెర ఉద్యోగం నుండి డిస్మిస్ – ఉద్యోగంతో పాటు మీ పెన్షన్కి దెబ్బ.కానీ మీ నిజాయితీయే మిమ్ము కాపాడింది. ఆ మంచికి నేను సూత్రధారుడ నవడం, నా అదృష్టం. మీకు న్యాయం జరగడానికి నావంతు పాత్ర తోడ్పడినందుకు నేను చాల ఆనందిస్తున్నాను...!"

ఇక్కడి వరకు చదివి రవి అనుకున్నాడు

"నువ్వు రావడం నీ అదృష్టం కాదు. నా అదృష్టం! మాటల్లో చెప్పలేనంత ఊహకందనంత! నా మీద ఎంక్వయిరికి నాస్వంత మేనల్లుడే రావడం (అతనెవరో నాకు తెలియకుండా) ఎంత విచిత్రం! చిత్రాతివిచిత్రం! అదీ నా గురించి నా చెల్లెలు ద్వారా పూర్తి నిజాలు, నిష్పక్షపాతమైన నిజాలు తెలుసుకొని రావడం. అదీ నాతోడపుట్టిన చెల్లెలు తనకు నేను చేసిన అన్యాయాలు, పార్టేసిన అవమానాలు మరచిపోయి తన సహజ సిద్ధమైన, స్వశమైన ప్రేమాభిమానాలతో కొడుక్కి మంచి నూరిపోసి ప్రమాదపు అంచున ఉన్న నన్ను కాపాడేలా చేసిన ఆ మానవత్వపు పరాకాష్ఠకు మాటలున్నాయా? నేను పుట్టినప్పుడు మానాన్నగారు ఎంతో ఆలోచించి, ఎందరినో స్నేహితులనడిగి సహజసిద్ధమైన కాంతిని ప్రసరించే సూర్యదేవుడని పేరు పెట్టారు. కాని అసలు వెలుగునిచ్చేది నువ్వే చెల్లెమ్మా! నా యీ సూర్యుడు చీకటిలో మునిగిపోయినపుడు నీ దీపం జ్యోతితో నా జీవితపు చీకట్లను పారదోలేవు."

మరల రవి ఉత్తరాన్ని కొనసాగించాడు "మీరు మాయింటికి వచ్చినపుడు, నేనెవరో మీకు తెలియదు. నేనొక ప్రశ్న సంధించాను మీకు, మీకు మీ బంధుమిత్రులతో, ఆత్మీయులతో బాంధవ్యాలు, కష్టసుఖాల్లో పాలుపంచుకోవడాలు ఉన్నాయా అని? దానికి మీరు "ఏమాత్రం లేవు' అని

ఏమాత్రం దాచకుండా నిజం చెప్పేరు! ఒక వేళ మీరబద్ధం చెప్పి ఉంటే సంబంధ బాంధవ్యాలు బాగున్నాయి, అని, ఎప్పటికీ నేనెవర్నో మీకు తెలిసి ఉండేది కాదు!

మావయ్యగారూ! ఇప్పుడు గతం వదిలేద్దాం. ప్రస్తుతానికి వద్దాం. ఒక్క నిజాన్ని మీకు నిర్మోహమాటంగా చెబుతాను. మీరు మీ తల్లిదండ్రులకు నలుగురు సంతానం. మీకు మీ తల్లిదండ్రులతోను, తోడబుట్టిన వాళ్లతోను బాంధవ్యాలులేవు గాని, మిగిలిన ఆ ముగ్గురికీ అవి బాగానే ఉన్నాయి కదా! ఈ సంగతి మీకు తెలుసు. కొంతవరకు నేనిప్పుడు చెబుతున్నాను, వాళ్లందరూ, వాళ్ల పిల్లలతో సహా అందరూ అంటే నాతో సహా తరుచు కలుసుకుంటూనే ఉన్నాం మీరూ, మీ చిన్న కుటుంబం తప్ప! ఇప్పుడాలోచించండి, లోపం ఎక్కడుందో? మరోసంగతి! బంధుమిత్రులు తరచుకలుసుకుంటూంటే, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటే అందరికీ లాభమే కదా! ఈ సంగతి మీకు తెలియదని కాదు, సందర్భం వచ్చింది కదా అని చెబుతున్నాను. మీరు హైద్రాబాదులో నా రెసిడెన్సికి వచ్చినప్పుడు, నా పిచ్చి ప్రశ్నలతో మిమ్మ విసిగించి ఉంటే క్షమించండి. అత్తయ్య గారికి నమస్కారాలు! మీ కృష్ణమోహన్"

ఇప్పుడు రవి మరల శుభలేఖని ఆ సాంతం చదివాడు. అది శివ అన్న త్రిమూర్తులు, వదిన సూర్యకాంతం మీద తన తమ్ముడు శివ, జ్యోతి దంపతుల ఏకైక పుత్రుని వివాహమహోత్సవ ఆహ్వాన పత్రిక. అదే సరియైన పద్ధతి. చిన్నవాడైనా ఇప్పుడు తనకు అయిష్టుడైనా తన కొడుకు వంశీ అదే చెప్పాడు. తను తన తల్లిదండ్రుల పేరు మీద శుభలేఖ రాయాలి. వాళ్లీ సమయానికి బ్రతికి ఉండటం తన అదృష్టంగా పూర్వ జన్మసుకృతంగా భావించాలి. తను వాళ్లని పూర్తిగా విస్మరించాడు. ఇప్పుడయినా తన జీవిత చక్రాన్ని వెనక్కి తిప్పాలి. తన బంధు మిత్రులతో సంబంధబాంధవ్యాలను పునరుద్ధరించాలి. ఈ పెళ్లి పిలుపు మంచి ఆలోచనలకు నాంది కావాలి.! ఎటువంటి దుర్బోధలకు లొంగకూడదు. సంకుచిత ఆలోచనలకు స్వస్థిపలకాలి.

" ఏమిటండీ చేతిలో ఆ శుభలేఖ? ఏమిటి మీ ముఖం సంతోషంతో వెలిగిపోతోంది?" చెంగుతో చేతులు తుడుచుకుంటూ ఇందిర రంగప్రవేశం.

" ఆ కేసు సందర్భంలో నా మీద ఎంక్వయిరీకి మా హెడ్డాఫీసునుండి ఒక అబ్బాయి వచ్చాడు గుర్తుందా?"

"ఎందుకు గుర్తుండదు? ఆ అబ్బాయి మనింటికీ వచ్చి మన ఇంటిలోని బీరువాలు వెదికాడు కదా! ఆ అబ్బాయి పేరు అదేనండీ, కృష్ణా రావు అనుకుంటాను"

"సగం రైటే ఆ అబ్బాయిపేరు కృష్ణమోహన్! ప్రమాదంలోపడిన నా ఉద్యోగాన్ని కాపాడి మంచి రిపోర్టు ఇచ్చి చీకటిలో మునిగిపోయిన మన జీవితాల్లో వెలుగురేకలు నింపిన ఆపద్బాంధవుడు! ఆ అబ్బాయి, అదే కృష్ణమోహన్ పెళ్లిశుభలేఖ ఇది, చూడు."

అంటూ ఆ శుభలేఖ చేతిలోపెట్టకుండా. ఆమెకు కన్పించేంత దూరంలో కవర్ పై భాగం మాత్రం చూపించాడు. అక్కడ "కృష్ణమోహన్ వెడ్స్ రాధ" అని ఉంది.

"ఏదిలా ఇవ్వండి చూస్తాను"

"అమ్మో! దీనితో చాల కథ ఉంది, జాగ్రత్తగా దాయాలి" అంటూ తన డైరీలో పెట్టేశాడు.

"ఇప్పుడు చెప్పండి ఆ కథాకమామీషు."

"కథంతా నీకే క్రమక్రమంగా తెలుస్తుందిలే ఈ పెళ్లి వధువు వాళ్లుండే కాకినాడలో జరుగుతుందట అక్కడే విషయం మాట్లాడుకుందాం.."

★★★

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments